క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రులకు నులిపురుగు నివారణ మాత్రలు



నాగాయలంక: ఈ నెల పదో తేదీన డీ వర్మింగ్ డేను పురస్కరించుకుని నాగాయలంక మండలంలోని ప్రభుత్వ వైద్యశాలలకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె.సీతారామ్ కుమార్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందు, మాత్రలు పంపిణీచేశారు. వైద్యాధికారులు డాక్టర్ కె.శివరామకృష్ణ, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఈ మందులను అందజేశారు. డీవర్మింగ్ డే విశిష్టత, నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.వి.ఎస్.రామదాసు పాల్గొన్నారు.

గజమాల యాత్ర జయప్రదానికి వినతి

నాగాయలంక: కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో స్వామి వార్షిక తిరునాళ్లను పురస్కరించుకుని జరిగే గజమాల యాత్రకు తరలి రావాలంటూ ఆహ్వాన కమిటీ సభ్యులు కోలా బాలజీవర్మ, లంకె యుగంధర్ కోరారు. మండలంలోని అగ్నికుల క్షత్రియులు గ్రామాల్లో గురువారం ప్రచారం చేశారు. తొలుత నాగాయలంకలోని అగ్నికుల క్షత్రియ ప్రముఖులతో కలసి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. బంటుమిల్లి మండలం చోరంపూడి నుంచి శుక్రవారం ఉదయం 8 గంటలకు యాత్ర బయలుదేరి మధ్యాహ్నానికి అంతర్వేదికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా మత్స్య సహకార సొసైటీ డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, ఏపీ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు లకనం నాగాంజనేయులు, రేవు సువర్ణరాజు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఐడీబీఐ వితరణ



మచిలీపట్నంటౌన్: స్థానిక రుస్తుంబాద మున్సిపల్ హైస్కూల్‌కు నగరంలోని ఐడీబీఐ బ్యాంక్ అధికారులు గురువారం పలు వస్తువులను వితరణగా అందజేశారు. బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో హైస్కూల్‌కు సీసీ కెమెరాలు, సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలు, టేబుళ్లు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఆర్.సాయికృష్ణ, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పి.ప్రేమ్‌చరణ్, సిరికృష్ణ థియేటర్ యజమాని వేమూరి బాల రత్నం పాల్గొన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు శ్రీధర్, సిబ్బంది ఐడీబీఐ బ్యాంక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల విరాళం

పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గురువారం రూ.1.06 లక్షల విరాళం అందజేశారు. గత ఏడాది పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత మిగిలిన రూ.1.06 లక్షలను సప్తగిరి గ్రామీణ బ్యాంకులో పాఠశాల పేరుపై డిపాజిట్ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని హైస్కూలు హెచ్ఎం ఎ.అశోక్‌కుమార్‌కు అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతి మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందించాలని కోరారు.

ముగిసిన 84వ గ్రిగ్ పోటీలు



ఘంటసాల: మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ ఆటల, క్రీడల పోటీలు గురువారం ముగిశాయి. అథ్లెటిక్స్ జూనియర్స్ విభాగంలో శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.విజయ తేజ 100 మీటర్లు, హైజంప్ మొదటి స్థానంలో, లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచాడు. సీనియర్స్ విభాగంలో పామర్రు అస్సిసి హైస్కూల్ విద్యార్థి డి.దయాకర్ ట్రిపుల్ జంప్, హై జంప్, లాంగ్ జంప్ విభాగాల్లో మొదటిస్థానంలో నిలిచాడు. సుమారు 17 విభాగాల్లో జరిగిన ఆటల పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంఈఓ పిడుగు ప్రభాకరరావు, అత్తలూరి గోపిచంద్, మల్లంపాటి పిచ్చేశ్వరరావు, విశ్రాంత హెచ్ఎం గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్, పూర్వ విద్యార్థి కోనేరు వెంకటేశ్వర ప్రసాద్ బహుమతులు అందజేశారు. సెంట్రల్ జోన్ ఆటల పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కుంపటి జీవన్‌కుమార్, వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి మాసిలామణి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల వెంకటరమణ, ఆళ్ల రమేష్, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, నాదెళ్ల బసవేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉసురుకొట్టుకోవద్దు

- వాడీవేడిగా మచిలీపట్నం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం
- దివ్యాంగ పింఛన్ల తొలగింపుపై వైఎస్సార్ సీపీ సభ్యుల ఆగ్రహం
- కలెక్టర్ బాలాజీ తీరును తప్పుపట్టిన కార్పొరేటర్లు
- కూటమి నాయకులు, అధికారుల తీరుపై మండిపడిన వైనం



దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలనపై జరిగిన చర్చలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదానికి దిగిన టీడీపీ సభ్యుడు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం గురువారం వాడీవేడిగా సాగింది. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాహిత అంశాలను చర్చిస్తుండగా టీడీపీ సభ్యులు పదేపదే అడ్డుతగిలారు. మునిసిపల్ కమిషనర్ సహా పలువురు అధికారులు, సిబ్బంది తమ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూటమి నాయకులకు వత్తాసు పలుకుతూ విధులు నిర్వర్తించడాన్ని అధికార వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తప్పుపట్టారు. పలు డివిజన్లలో పారిశుద్ధ్యం పరిశీలనకు వస్తున్న కలెక్టర్ స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకుండా ఆయా డివిజన్ల కూటమి నాయకులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇకపై కలెక్టర్ ఏ డివిజన్‌కు వస్తే ఆ డివిజన్ కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చేలా చూడాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. ఏకపక్షంగా విధులు నిర్వహిస్తూ, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న మెప్మా సీఎంఎం ఆనంద్‌బాబును విధుల నుంచి తప్పిస్తూ తీర్మానం రాసి ఉన్నతాధికారులకు పంపాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న కోరారు. ఆర్పీలు టీడీపీ సభ్యత్వాలు కట్టిస్తుండగా ప్రత్యక్షంగా పట్టుకుని అప్పగించినా ఆనంద్‌బాబు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఒకటో డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి పేర్కొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలనపై ఆగ్రహం

దివ్యాంగ పింఛన్‌దారులను సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలనకు జీజీహెచ్‌కు వెళ్లాలంటూ సచివాలయ సిబ్బంది నోటీసులు ఇస్తున్నారని, నగరంలో ఎంత మందికి ఇచ్చారని మేకల సుబ్బన్న అధికారులను ప్రశ్నించారు. 3,184 మందికి నోటీసులు ఇచ్చామని, జీజీహెచ్‌లో మార్చి 15వ తేదీ వరకు పరీక్షలు చేస్తారని కమిషనర్ బాపిరాజు వివరించారు. గతంలో దివ్యాంగులుగా వైద్యులు నిర్ధారించినందునే వారు ఎన్నో ఏళ్లుగా పింఛన్లు పొందుతున్నారని, టీడీపీ పాలకులు నోటీసులు ఇచ్చి పింఛన్‌లను తొలగించేందుకు పూనుకోవడాన్ని సుబ్బన్న తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడిచినా ఒక్క పింఛన్ ఇవ్వకుండా, ఉన్నవి తొలగించి వారి ఉసురుకొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగ సర్టిఫికెట్లతో చాలా మంది పింఛన్‌లు పొందు తున్నారంటూ మేయర్ పోడియం వద్దకు వచ్చి టీడీపీ సభ్యుడు రాము వైఎస్సార్‌సీపీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఓ దశలో వ్యక్తిగత దూషణలు చేశారు.

పారిశుద్ధ్యం అధ్వానం

నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై కూటమి నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని 48వ డివిజన్ కార్పొరేటర్ ముచ్చర్ల శైలజ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు పలువురు డివిజన్లలో ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తూ సాగిస్తున్న చర్యలతో ప్రజలు విసుగు చెందుతున్నారని పేర్కొన్నారు. కౌన్సిల్‌కు తెలియకుండానే చారిత్రక కోనేరుసెంటర్‌లో మరుగుదొడ్లు నిర్మించి, నీటి బోర్లు ఎలా వేస్తారని ఇంజినీర్లను సుబ్బన్న ప్రశ్నించారు. ఓ సంస్థ ద్వారా మంత్రి కొల్లు రవీంద్ర మరుగుదొడ్లు కట్టించారని, నీటి వసతి కోసం కమిషనర్ ఆదేశాలతో బోర్లు వేశామని ఇంజినీర్లు బదులిచ్చారు. ఆ డివిజన్ కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మికి తెలియకుండా, కౌన్సిల్ తీర్మానం లేకుండా రోడ్డు పగులకొట్టి బోర్లు వేయడంపై సుబ్బన్న ఆగ్రహం వ్యక్తంచేశారు. మేయర్‌కు, కౌన్సిల్‌కు తెలియకుండానే 61 పనులను రూ.4.38 కోట్లతో చేసేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెండర్లు పిలిచారని, ఈ నిధుల ఖర్చుకు బడ్జెట్ ఆమోదం ఎప్పుడు పొందారు, ఆమోదం లేకుండా ఎక్కడి నుంచి నిధులు రాబడతారని సుబ్బన్న కమిషనర్‌ను ప్రశ్నించారు. తనకు కొన్ని ప్రత్యేక అధికారాలు ఉంటాయని, నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తే శిక్షించేందుకు ప్రభుత్వ సంస్థలు ఉన్నాయని కమిషనర్ చెప్పుకొచ్చారు.

పొదుపు నిధులు ఏమయ్యాయి?

నగరంలోని డ్వాక్రా సమాఖ్యలకు సంబంధించిన పొదుపు నగదు రూ.1.50 కోట్ల మేర ఉందని, ఆ నిధులు, వాటిపై వచ్చే వడ్డీ ఏమయ్యాయని 49వ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్ ప్రశ్నించారు. ఈ మొత్తం ప్రభుత్వం వద్దే ఉందని సీఎంఎం ఆనంద్ బాబు వివరించారు. టీడీపీ కార్యాలయం వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు రాజుపేట షాదీఖానా వద్ద పేద వ్యక్తి యూనస్ తన ఇంటి ముందు కూరగాయల దుకాణం నిర్వహిస్తుంటే తీసేయాలని హెచ్చరించడం ఏమిటని కార్పొరేటర్‌లు షేక్ షహెనా, షేక్ అబేదా ప్రశ్నించారు. చేపల మార్కెట్‌లో ఆశీలు వసూలు హక్కును నిబంధనలకు విరుద్ధంగా ఎలా ఇస్తారని, ఉల్లింగాపాలెంలోని గుమ్మటాల చెరువు వివాదం కోర్టులో ఉండగా ఫెన్సింగ్ పనులు ఎలా చేస్తారని, చెరువును ఆక్రమించి పక్కా గృహాలు నిర్మిస్తున్నా ఎందుకు అడ్డుకోవటం లేదని టీపీఎస్ హరిప్రసాద్‌ను మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ప్రశ్నించారు. రెండు విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా తీర్మానం రాయాలని మేయర్‌ను కోరారు. ఈ సందర్భంగా రెండు అంశాలు, మరో అంశంతో ఉన్న టేబుల్ అజెండాను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ బాలాజీ



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెడన: పట్టణ ప్రజలకు పారిశుద్ధ్యం తడి–పొడి చెత్తను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించాలని మునిసిపల్ కమిషనర్‌ను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛతహి సేవలో భాగంగా పట్టణంలో 23వ వార్డులో శానిటేషన్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ గోపాలరావుతో కలిసి గురువారం ఉదయం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ బాలాజీ స్థానికులతో మాట్లాడిన అనంతరం మునిసిపల్, శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్త అంటే ఏమిటో చాలా మందికి తెలియడం లేదన్నారు. తక్షణం వాటిపై అవగాహన కల్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. తరచూ రోడ్లపై చెత్తను వేసే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, ఆయా చెత్తకుప్పలను తొలగించి ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైతే సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రెయిన్లు, రోడ్లు అన్న తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ చెత్తను వేసే వారికి శానిటేషన్ సిబ్బంది అవగాహన కల్పించాలని, అయినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. శానిటేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో సుబ్రహ్మణ్య హవనం



శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సుబ్రహ్మణ్య హవనం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సుబ్రహ్మణ్య హవనం నిర్వహించారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ఐదు గంటలకు సుప్రభాతసేవ, ప్రాతః కాలార్చన, పంచామృత స్నపన, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య హవనం జరిగింది. బుధవారం రాత్రి ఆలయ కల్యాణ మండపం ప్రాంగణంలోని జమ్మిచెట్టు వద్ద వేద పండితులు శమీవృక్ష పూజ, అనంతరం మయూర వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

ఏడుకొండలు కుటుంబానికి పేర్ని కిట్టు పరామర్శ



కోనేరుసెంటర్: మండలంలోని సత్రవపాలెంనకు చెందిన చింతా ఏడుకొండలు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గురువారం పరామర్శించారు. ఏడుకొండలు ఈ నెల ఒకటో తేదీన చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో పడిపోయి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి ఏడుకొండలు ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో పేర్ని కిట్టు గురువారం రాత్రి సత్రవపాలెం వెళ్లి ఏడుకొండలు కోసం విలపిస్తున్న అతని భార్య వెంకటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పలు శాఖల అధికారులకు ఫోన్ చేసి, ఏడుకొండలు కుటుంబ ఆవేదనను దృష్టిలో పెట్టుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని కోరారు. మనిషి సముద్రంలో గల్లంతై ఐదు రోజులు కావస్తున్నా గాలింపు చర్యలు ముమ్మరం చేయకపోవడాన్ని తప్పుపట్టారు. ఏడుకొండలు కుటుంబానికి అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గడిదేశి బాలజీసు, వైఎస్సార్ సీపీ నాయకులు గడిదేశి రాజు, తిరుమలశెట్టి ప్రసాద్, బలగం వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

దీప్తిని అభినందించిన పేర్ని కిట్టు




మచిలీపట్నంటౌన్: నగరానికి చెందిన వీణ వాద్య కళాకారిణి దీప్తిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ గురువారం ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని గత నెల 28వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో అప్పికట్ల దీప్తి వీణ కచేరీ చేశారు. ఆమెను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. ఈ నేపథ్యంలో నగరంలోని దీప్తి నివాసానికి వెళ్లిన పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ ఆమెను, ఆమె తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలపై డ్రోన్ కెమెరాలతో నిఘా



శ్రీకాకుళం(ఘంటసాల): గ్రామ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడాలి, శ్రీకాకుళం, లంకపల్లి శివార్లలోని రహస్య ప్రాంతాల్లో పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యంపానం, చట్ట వ్యతిరేక పనులు చేసే అవకాశం ఉన్న చోట జిల్లా పోలీస్ యంత్రాంగం సహకారంతో డ్రోన్ కెమెరాలతో గురువారం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో జూదం, బహిరంగ మద్యపానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులు జరిగిన వెంటనే గుర్తించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టంచేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సత్తాచాటిన గిలకలదిండి హై స్కూల్ విద్యార్థులు



మచిలీపట్నంటౌన్: ఇటీవల మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో జరిగిన 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటలు పోటీల్లో గిలకలదిండి మునిసిపల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్స్ బాలుర వాలీబాల్ పోటీలు, సీనియర్ బాలికల వాలీబాల్ పోటీలు, సబ్ జూనియర్ బాలికల ఖోఖో పోటీలు, సబ్ జూనియర్ బాలికల చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఘంటసాల మండలం గోగినేనివారి పాలెం జెడ్పీ హైస్కూల్లో జరిగిన సెంట్రల్ జోన్ బాలుర ఆటల పోటీల్లో జూనియర్ వాలీబాల్ పోటీలు, జూనియర్ చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. క్రీడాకారులను హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని జి.పి.రత్నప్రభ, సీనియర్ ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావు, పార్ట్ టైం పీఈటీలు లేళ్ల అశోక్, అంకాని శేషుబాబు అభినందించారు.

ఉయ్యూరు వీరమ్మ తల్లిని దర్శించుకున్న కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట యాదవ వీధిలో ఉన్న రామాలయానికి విచ్చేసిన ఉయ్యూరు వీరమ్మ తల్లిని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గురువారం దర్శించుకున్నారు. పతులబాద్ సమీపంలోని యాదవుల బజారు నుంచి రాజుపేట రామాలయానికి ఉయ్యూరు వీరమ్మ తల్లి ఊరేగింపుగా తరలివచ్చింది. కార్పొరేటర్ అయినం తాతారావు, నాయకులు గాజులు భగవాన్, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన

ఘంటసాల: కృష్ణాజిల్లా వ్యవసాయ సాంకేతిక యాజాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ సేవలపై శిక్షణ పొందుతున్న ఇన్‌పుట్ డీలర్లు ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి కేవీకే విధులు, వివరాలు, పనితీరు, కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మినుములో వచ్చే తెగుళ్లు, పురుగులు, విత్తన ఉత్పత్తిపై జరిగిన చర్చా గోష్టిలో డీలర్ల సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ యశ్వంత్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మోపిదేవి జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

మోపిదేవి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 76వ వార్షికోత్సవం శుక్రవారం జరుగుతుందని ప్రధానోపాధ్యాయిని పి.జయంతి గురువారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు సర్పంచ్ నందిగం మేరీరాణి జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, సాయంత్రం 4 గంటలకు సభాకార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు పాఠశాల విద్యా కుటుంబ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం, అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

సంక్షిప్తంగా...

స్వచ్ఛ చల్లపల్లికి రూ.50 వేల విరాళం

చల్లపల్లి(అవనిగడ్డ): కార్మికసంఘ నాయకుడు మిక్కిలినేని పాపారావు స్వచ్ఛసుందర చల్లపల్లి కార్యక్రమానికి గురువారం రూ.50 వేల విరాళం అందించారు. గతంలోనూ రూ.50 వేల విరాళం ఇచ్చారు. తన కుమారుడు మిక్కిలినేని మధు, మనవడు శశినిఖిల్‌తో కలసి ఈ మొత్తాన్ని స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్వాహకుడు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్‌కు అందించారు.

పాడి పశువుల పెంపకందారులకు శిక్షణ

బంటుమిల్లి: కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పాడి పశువుల పెంపకందారులు మరింత నైపుణ్యాన్ని పొందేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక వైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు గుంటూరు కొత్తపేటలో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. శిక్షణకు హాజరయ్యే రైతులు 91330 10203, 95421 20405 సెల్ నంబర్లను సంప్రదించాలని స్ఫూర్తి సూచించారు.

ఫిషరీస్ విద్యార్థులకు సూర్య నమస్కారాల పోటీ

భావదేవరపల్లి(నాగాయలంక): రథసప్తమి వేడుకల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో స్థానిక ఎంవీకేరావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సాయంత్రం విద్యార్థులకు సూర్య నమస్కారాల్లో పోటీలు నిర్వహించారు. తొలుత సంస్థ కృష్ణాజిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అధ్యక్షతన సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యభారతి సంస్థ అఖిలభారత సహాయ కార్యదర్శి డాక్టర్ ఎ.వి.ఎల్.నారామణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చు కోవాలని సూచించారు. అధ్యాపకులు ఎ.విశాల్‌కుమార్, అల్లి అశ్రిత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యం



పెడన: పాడి రైతులకు ఇతర సంఘాలు కంటే కృష్ణా మిల్క్ యూనియన్ అధిక ధర చెల్లిస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వజ్రోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని నందమూరు పాల కేంద్రం వద్ద గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, రైతులను సన్మానించారు. జిల్లా పాలకవర్గ సభ్యుడు అర్జ వెంకట నగేష్, ట్రస్ట్ డైరెక్టర్ కాగిత జయరాం, ఫీడ్ కమిటీ సభ్యుడు మోతు కూరి వెంకటేశ్వరరావు, మేనేజర్ తోట సత్యనారాయణ, నందమూరు సంఘ అధ్యక్షుడు నెక్కంటి వెంకట సుబ్బారావు, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవరాజ కుమార్, వేతన కార్యదర్శి వినయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన వజ్రోత్సవాలు

బంటుమిల్లి: రైతుల వద్ద పాల సేకరణ ప్రారంభమై 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గ్రామ, గ్రామాన వజ్రోత్సవాలు నిర్వహిస్తూ పాడి రైతులను సత్కరించి ప్రోత్సహిస్తున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. మండలంలోని బర్రిపాడు పాల సేకరణ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి పాడి రైతులతో ఆయన మాట్లాడారు. అనంతరం రైతులతో కలసి కేక్ కట్ చేసి అధ్యక్షులు, రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టరు అర్జా నగేష్‌బాబు, గుడ్లవల్లేరు చిల్లింగ్ సెంటర్ మేనేజరు తోట సత్యనారాయణ, సభ్యులు కాగిత జయరాం, ఎం.వెంకటేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు జోగి జయ జగన్నాథరావు, సూపర్‌వైజరు సీహెచ్. వరప్రసాదు పాల్గొన్నారు.


మినుములో కాండం గజ్జి తెగులు

శివరామపురం(మోపిదేవి): కాండం గజ్జి తెగులు ఆశించి మినుము పైరును నష్టపరుస్తోందని ఘంటసాల కేవీకే విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని శివరామపురం, వెంకటాపురం గ్రామాల్లో మినుము పంటను వారు గురువారం పరిశీలించారు. మినుము పైరులో కాండం గజ్జి తెగులు వ్యాప్తి చెందడాన్ని గమనించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు మెటలాక్సిల్ ప్లస్ మాంకోజెబ్ మందు ఎకరానికి 300 గ్రాములు లేదా టెబ్యుకొనజోల్ 300 మిల్లీలీటర్లు నీటిలో కలిపి నేల తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. మినుములో పొగాకు లద్దెపురుగు, పూత పురుగు ఉధృతి అధికంగా ఉందని, వీటి నివారణకు వేప సంబంధిత మందులను ఎకరానికి 1500 పీపీఎం లీటరు చొప్పున పిచికారీ చేసుకోవా లని సూచించారు. పురుగు ఉధృతి అధికమైతే స్పైనోసాడ్ 60 మిల్లీలీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఎకరానికి పిచి కారీ చేయాలని పేర్కొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

గూడూరు: మండలంలోని గోగినేనిపాలెంలో జరిగిన 84వ గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్ పోటీలలో సినియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతగా నిలిచిన కప్పలదొడ్డి హైస్కూలు క్రీడాకారులను గురువారం పాఠశాలలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.జ్యోతి, మాజీ సర్పంచి కట్టా మునేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శివకృష్ణ క్రీడాకారులతో పాటుగా పీడీ మురళీకృష్ణను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

దాలిపర్రు కరణం జనార్దనరావు మృతి



దాలిపర్రు (ఘంటసాల): దాలిపర్రు కరణంగా స్థానికులకు సుపరిచితులైన దాలిపర్తి వెంకట జనార్దనరావు (97) తుదిశ్వాస విడిచారు. గురువారం రాత్రి తమ స్వగ్రామం ఘంటసాల మండలం దాలిపర్రులోని ఇంటి వద్ద ఆయన మృతి చెందారు. సుదీర్ఘ కాలం ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల ప్రజలకు ఆయన కరణంగా సేవలు అందించారు. ఆయన మృతితో చల్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, దాలిపర్రు గ్రామ పెద్దలు సంతాపం తెలిపారు.

